ఎంఫార్మసీ పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ మొదటి, రెండు, మూడో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు.

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్ఐ), బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎల్‌డీ), బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ), బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఏఎస్‌డీ) కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్/ఐడీ) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 11వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను డిసెంబర్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్

సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 25: విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ పిలుపునిచ్చారు. తద్వారా ప్రస్తుత పోటీ ప్రపంచంలో ముందంజ వేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఓయూ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మెడికల్ ఎక్విప్‌మెంట్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా వీసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగిస్తూ విద్యార్థులు ఆవిష్కరణలు చేసేలా అధ్యాపకులు తీర్చిదిద్దాలన్నారు. రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో వస్తున్న పురోగతి ద్వారా బయోమెడికల్ ఇంజినీరింగ్ వైద్యరంగ ముఖచిత్రాన్నే మార్చివేస్తోందని చెప్పారు. రోగనిర్ధారణ, చికిత్స, రోగుల సంరక్షణలో సరికొత్త హద్దులను సృష్టిస్తోందని అన్నారు. నూతన సాంకేతికత, ఆవిష్కరణలు పేదలకు వైద్య సదుపాయం అందుబాటులోకి తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. వైద్య పరికరాల కోసం కేంద్రం ఇటీవల ఏర్పాటు చేసిన సీడీఎస్‌సీవో (సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్)కు సంబంధించిన అంశాన్ని కూడా సదస్సులో చేర్చినందుకు నిర్వాహకులను అభినందించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సదస్సు కోఆర్డినేటర్లు డాక్టర్ డి.సుమన్, డాక్టర్ కేఈసీ విద్యాసాగర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలోని నిపుణుల ద్వారా వైద్య పరికరాల్లో వినూత్నమైన పురోగతిని విద్యార్థులకు వివరించేందుకు సదస్సును ఏర్పాటు చేసినట్టు వివరించారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎం.మాలిని, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఒడిదొడుకులు తట్టుకొనేందుకు బీమా

చిక్కడపల్లి, అక్టోబర్ 25: ఒడిదొడుకులను తట్టుకునేందుకు శాస్త్రీయ పంటల బీమా సహాయ పడుతుందని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ ఆర్.రామ్‌కుమార్ అన్నారు. చైతన్య సేద్యం రైతుల మాస పత్రిక వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రతికూల వాతావరణ మర్పులు – రైతు పంటల బీమా అవసరాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ప్రొఫెసర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో పంటల బీమా పథకం రైతుల ఆదరణ పొందలేదని అన్నారు. దీనికి ప్రధాన కారణాలు బీమా పథకాలు రూపొందిచిన అమలు చేసిన విధాన లోపాలే కారణమని పేర్కొన్నారు. సమగ్రమైన పంట, ఆదాయ బీమా పథకాన్ని రూపొందించాలన్నారు. ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్‌రావు రాసిన ప్రతికూల వాతావరణ మార్పులు రైతుల దుస్థితి నివారణ పుస్తకాన్ని డాక్టర్ పీవీ అమర్‌నాథ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రిశ్వర రావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, డాక్టర్ పద్మాకర్‌రావు, సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, నర్సింహా రెడ్డి, జంగా రెడ్డి, రమేశ్, బుర్రి శ్రీరాములు, వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సామాజిక పెరుగుదలకు సంగీతం దోహదం

చిక్కడపల్లి, అక్టోబర్ 25: శ్రీకీర్తన సంగీత అకాడమీ 4వ వార్షికోత్సవాలు శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చిక్కడపల్లి సెంట్ అకాడమీ ప్రిన్సిపాల్ సి.గిరి జాశివదాస్ హాజరై మాట్లాడారు. పిల్లల సామాజిక పెరుగుదలకు సంగీతం వంటి కళలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. అకాడమీ గురువు సుష్మవేదగిరి శిష్యబృందం వివిధ భక్తి గీతాలు ఆలపించారు. విజయ్‌చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.

ఎల్లమ్మ సన్నిధిలో ఏపీ ఎంపీ మిథున్‌రెడ్డి

ఏపీలోని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తన తండ్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన వీరికి ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలతో పాటు శేష వస్త్రాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు. అనంతరం పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు దేవాలయ ఆవరణలోని అద్దాల మండపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు.

– అమీర్‌పేట్, అక్టోబర్ 25

కళా గురువులకు పథకాలు ఇవ్వాలి

చిక్కడపల్లి, అక్టోబర్ 25: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు కళా గురువులందరికీ అందించాలని పలువురు కళాకారులు ప్రభుత్వాలను కోరారు. చినుకు కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కళా గురువుల సమావేశం సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ప్రియన్‌మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ నిర్మాత డాక్టర్ జి.అనూహ్యారెడ్డి, బిల్డప్ షాట్ సీఈఓ నవీన్‌కృష్ణ గోసల, తెలుగు వెలుగు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌దత్తి హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏండ్లు దాటిన వృద్ధ కళాకారులందరికీ పెన్షన్ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని కళావేదికలను గుర్తింపు కలిగిన కళా సంస్థలకు వారి ప్రదర్శనలకు గాను ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రతి జిల్లాలో కళా వేదికలను నిర్మించాలని, కళా గురువులకు ప్రతి నెల రూ.15వేల పారితోషం ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు.

సమావేశంలో ప్రియన్‌మూర్తి, అనూహ్యారెడ్డి, తదితరులు

సామాజిక విప్లవకారుడు కలేకూరి

కలేకూరి ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 25: సామాజిక విప్లవకారుడు కలేకూరి ప్రసాద్ 62వ జయంతిని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు నామ సైదులు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కలేకూరి ప్రసాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. సమసమాజ స్థాపన కోసం పోరాడిన సామాజిక విప్లవవీరుడు, గొప్ప రచయిత, కవి, సాహితీవేత్త, అనువాదకుడు అని గుర్తుచేశారు. శక్తివంతమైన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన ఆయన అంబేద్కరిజం, మార్క్సిజాన్ని తన నరనరాన జీర్ణించుకున్నాడని వివరించారు. తన చివరి శ్వాస వరకు సమసమాజ స్థాపన కోసం పోరాటం సాగించారని ప్రశంసించారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ అంకితమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఆజాద్, నెల్లి సత్య, శ్రీకాంత్, వలిగొండ నరసింహ, సుమంత్, తాళ్ల అజయ్, కోటేశ్, వంశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ జిగీష వార్షికోత్సవం

విజయలక్ష్మిని సత్కరిస్తున్న ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి

ముషీరాబాద్, అక్టోబర్ 25: సాహితీ జిగీష సాంస్కృతిక సంస్థ ద్వితీయ వార్షికోత్సవం శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి పలు అంశాలపై ప్రవచించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి పాల్గొని ప్రసంగకర్తలను సత్కరించారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో ఎం.దత్తాత్రేయశర్మ, సాహితీ జగీష్ అధ్యక్షుడు బండారుపల్లి రామచంద్రరావు, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ లలితవాణి, ఉపాధ్యక్షుడు రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరింగ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

సికింద్రాబాద్, అక్టోబర్ 25: సీతాఫల్‌మండిలోని ఎరుకలబస్తీలో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ హేమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు రూ.7లక్షల వ్యయంతో చేపట్టినట్టు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

ఎరుకల బస్తీలో జరుగుతున్న ఫ్లోరింగ్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

వేగంగా ఏర్పాట్లు పూర్తిచేయాలి

సికింద్రాబాద్: దీపావళి పండుగ సందర్భంగా శ్మశానవాటికకు వచ్చి పూజలు చేసే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కార్పొరేటర్ హేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు రూ.3 లక్షలతో పనులు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు లంబు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కలిసి శ్మశానవాటికలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును బీఆర్ఎస్ నేత వెంకట్‌రాంరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ముషీరాబాద్, అక్టోబర్ 25:

కళాసీగూడలో నేడు ఉచిత వైద్య శిబిరం

బేగంపేట్ అక్టోబర్ 25: జనహిత సేవా ట్రస్ట్, మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్ కళాసీగూడలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. కళాసీగూడ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జలంధర్‌గౌడ్ తెలిపారు. కిమ్స్ ఆసుపత్రి నుంచి ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, పీడీయాట్రిక్, డెంటల్, నేత్ర, జనరల్ ఫిజిషియన్లు వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తారని తెలిపారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. అవసరమైన వారు ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తల అదృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 25: ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తలు ఇంటినుంచి అదృశ్యమయ్యారు. ఈ ఘటన వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాపూజీనగర్‌లోని కనకదుర్గా వైన్స్ సమీపంలోని ఉన్న ఇంటిలో ఒక్కో అంతస్తులో ఒక్కొక్కరి చొప్పున ముగ్గురు సోదరులు నివసిస్తున్నారు. వారిలో రెండో చిన్నాల అమరేందర్ (53) కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో హెడ్‌వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. చిట్టీల వ్యాపారం కూడా నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా వ్యాపారంలో తీవ్ర నష్టం రాగా తన భార్య సబిత (49)తో కలిసి ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో అమరేందర్ బాకీపడిన వారు వచ్చి అదే ఇంటిలో నివసించే మిగిలిన సోదరులను వేధిస్తున్నారు. దీనిపై అమరేందర్ సోదరుడు రఘుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త శుద్ధి ఇదేనా?

ఇందిరానగర్‌కాలనీలో కాకతీయ స్కూల్ ముందు తొలగించని చెత్త కుప్పలు

సికింద్రాబాద్, అక్టోబర్ 25: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌కాలనీ–3లో పారిశుధ్యం పడకేసింది. కాలనీలోని బాలనర్సింహా సామాజిక భవనం ఎదుట చెత్త తరలించక పోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాలు రోడ్డుపైనే ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎదురుగానే స్కూల్ ఉండటంతో విద్యార్థులు తీవ్ర దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, అక్టోబర్ 25: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ ఫీవర్ ఆసుపత్రి, లేపాక్షి, వైఎంసీఏ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీవర్ ఆసుపత్రి, లేపాక్షి ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, ఫీవర్ ఆసుపత్రి, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ పంపు, తపాడి డయాగ్నస్టిక్, గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ, రాజా ఫర్నిచర్, లేపాక్షి, ఎన్‌బీకే ఎస్టేట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు వైఎంసీఏ ఫీడర్ పరిధిలోని రెడ్డి కాలేజీ, చైతన్య కాలేజీ, చిత్రపురికాలనీ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. వినియోగదారులు గమనించగలరని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బేగంపేట్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

బేగంపేట్, అక్టోబర్ 25: బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌లో పార్క్ చేసిన ఎయిర్‌క్రాఫ్ట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బేగంపేట్ ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అపోలో యాజమాన్యానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ వీటీపీసీఆర్ బేగంపేట్ విమాశ్రయంలో పార్కు చేసి అక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ గత ఏప్రిల్ 5న బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి చెన్నైకి వెళ్లేందుకు ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఉపయోగించారు. చెన్నైలో ల్యాండింగ్ సమయంలో విమానంలో ధ్వంసమైన పార్టులు, లోపాలను గుర్తించారు. దీంతో మరుసటి రోజు అపోలో యాజమాన్యం బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ అథారిటీకి ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఎయిర్‌క్రాఫ్ట్ సరిచేసి ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎయిర్‌క్రాఫ్ట్‌ను సరిచేయక పోగా ఘటనకు పాల్పడిన వారినీ గుర్తించలేక పోయారు. దీంతో అపోలో యాజమాని శుక్రవారం బేగంపేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాలల సత్తా చూపిస్తాం

- ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- మాలల జనాభా నిష్పతి ఎంతో తేల్చాలి
- తక్కువ జనాభా అంటూ దుష్ప్రచారం
- కులగణన చేయకుండా ముందుకెళ్తే ధర్మయుద్ధం తప్పదు
- మాల సంఘాల సమావేశంలో నేతల హెచ్చరిక

సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘాల ప్రతినిధులు

బడంగ్‌పేట, అక్టోబర్ 25: మాలల సత్తా ఏమిటో ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు రుచి చూపిస్తామని విశ్రాంత శాస్త్రవేత్త రాజేశ్వర్‌రావు అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ గాయిత్రీనగర్ సమతా భవనంలో మాల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ జనాభా తక్కువంటూ దుష్ప్రచారం చేస్తే తరిమికొడతామని హెచ్చరించారు. తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. నవంబర్ 10న ఎస్సీ వర్గీకరణనను నిరసిస్తూ నగరంలో సభను ఏర్పాటు చేస్తామన్నారు. మాలల ఐక్య సంఘటన కమిటీ పిలుపు మేరకు సభను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశాలు నిర్వహించాలన్నారు. తమ జనాభా నిష్పత్తి తేల్చిన తర్వాతే వర్గీకరణ అంశాన్ని ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. 30 ఏండ్ల నాటి లెక్కలు ఎలా పరిగణలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. ప్రస్తుతం మాలల స్థితిగతులపై అధ్యయనం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. పక్షపాతం లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే మహార్ సైన్యం స్ఫూర్తిగా ధర్మయుద్ధం చేస్తాని హెచ్చరించారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీలో ప్రతి మాల భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ గజ్జల రాంచందర్, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, చవ్వ శ్రావన్‌కుమార్, యంగల యాదగిరి, రాజలింగం, నర్సింగ్ రావు, కోటేశ్వర్‌రావు, మేకల పాండు, సూరి బాబు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that under the instructions of my client 1) Noor Bhasha Siddaiah, S/o.Mastan, 2) Noor Basha Ajabhi, W/o. Noor Basha Siddaiah, 3) Noorbash Durga Prasad, S/o. Noor Basha Siddaiah, 4) Noorbhash Rajiya, W/o. Noorbhash Durga Prasad, 5) Nur Bhash Nagoor, S/o. Noor Bhasha Siddaiah and 6) Smt. Shaik Sulthana, W/o. Nur Bhash Nagoor all R/o. H.No. 5, Venkayalapadu, Inkollu, Pusapadu village, Prakasam District presently residing at H.No. 8-4-300/1/A, Tower B 906, Kalpataru Residency, Ashok Marg, Prem Nagar, Erragadda, VTC: Sanathnagar, P.O. Sanathnagar I.E. Hyderabad, Telangana-500018, Cell No. 9849472141 and they purchased the House bearing No. 370/ L1/2RT, and Municipal No.7-1-621/368, admeasuring 273.33 Sq. yards or 228.50 Sq. Mtrs., situated at Sanjeeva Reddy Nagar, Hyderabad and bounded by North; House No.369/L2/2RT, South: House No. 371/L2/2RT, East: House No.383/L1/2RT, West: 30' Wide Road through a regd. Sale Deed Doc. No. 2516/2022 of SRO S.R. Nagar from M/s.Srikanth Entertainment Pvt., Ltd., rep. by its managing director Sudhakar Pallamala. That on 15-10-2024, they noticed that the original link documents i.e., 1) Sale Deed Doc.No. 1711/2006, Book-I, Dt.12-06-2006 & 2) Sale Deed Doc.No. 199/2006, Book-I, Dt.27-01-2006, both document Registered at SRO S.R. Nagar pertaining to the above said property was lost from his custody at Ayyappa Documentations shop, Near Sub-registrar Office Ghatkesar, as such my client hereby request the public that if anyone found kindly return the same to me or to my client. If any person having any objections may notify the same to me or to my above said client within (7) days of publication of this notice. If anyone misuses the said document my client will not be responsible.

Sd/- **V. LINGASWAMY**
M.B.A. LL.B
Advocate
Plot No. 37, Maitripuram Colony, Karmanghat, Saroornagar, R.R. District-500079.
Cell: 9848389497